పారిశుధ్యం పట్టని మున్సిపాలిటీ

నిరసన వ్యక్తం చేసిన వాకర్స్ గ్రూపు సభ్యులు

చెత్తగా మారిన ఓపెన్ జిమ్ ప్రదేశాన్ని శుభ్రం చేస్తున్న వాకర్స్ గ్రూపు సభ్యులు

చేర్యాల, జూన్ 19 : పట్టణంలోని పెద్ద చెరువు కట్ట పై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణ, పారిశుధ్య పనుల విషయంలో మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.నిత్యం మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్న చెరువు కట్ట వాకర్స్ గ్రూపు సభ్యులు తాజాగా మున్సిపాలిటీ పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు.చెరువు కట్ట పై మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణ పట్టించుకోని మున్సిపల్ అధికారులు, నిత్యం జిమ్ వద్ద శుభ్రం చేయించాలనే కనీస ధర్మం మర్చిపోవడం వాకర్స్ పట్ల శాపంగా మారింది. ఓపెన్ జిమ్ ఉన్న ప్రదేశంలో పెద్ద వేపచెట్టు ఉండడంతో చెట్టు నుంచి వేపపండ్లు పడి జిమ్ ప్రదేశం మొత్తం పండ్లతో నిండిపోవడంతో వాటి పై ఈగలు,దోమలు వ్యాపించి జిమ్ వద్ద నిలువలేని పరిస్థితి నెలకొంది. రోజువారీగా జిమ్ వద్ద మద్యం సీసాలు, వాటి పెంకులు తీసి ఓ పక్కన వేసి తమ పనులు చేసుకుంటున్న వాకర్స్ బుధవారం చీపుర్లు తీసుకువచ్చి ఓపెన్ జిమ్‌పై ఉన్న వేప పండ్లు, చెత్త తదితర వాటిని తొలిగించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ఎంతో ఉపయోగపడే జిమ్‌ను లక్షలాది రుపాయలు వెచ్చించి ఏర్పాటు చేసి దానిని నిర్వహణ మర్చిపోవడం దారుణమన్నారు.జిమ్ ఏర్పాటు చేసిన ప్రదేశాన్ని నిత్యం శుభ్రం చేయించాలనే విషయాన్ని పురపాలక సంఘం అధికారులు పట్టించుకోకపోవడంతో నిరసనగా తామే జిమ్ వద్ద శుభ్రం చేసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు.అన్నివర్గాల ఆరోగ్య పరిరక్షణలో ఉపయోగపడే ఓపెన్ జిమ్ నిర్వహణతో పాటు పారిశుధ్య పనులపై మున్సిపల్ అధికారులు శ్రద్ధ వహించాలని పెద్ద చెరువు కట్ట వాకర్స్ గ్రూపు సభ్యులు కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ముగ్గురి పరిస్థితి విషమం

దవాఖానలో రోధిస్తున్న బాధితుల బంధువులు

చేర్యాల, జూన్19: చేర్యాల మండలం కడవేర్గు గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్ సమీపంలో బుధవారం రాత్రి ఆటోను కారు ఢీకొట్టడంతో మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన సుమారు 15మంది గాయాలపాలయ్యారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో ఎల్లమ్మ దేవాలయ ప్రతిష్ఠాపన వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకలకు గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన ముక్క స్వరూప, ముక్క లక్ష్మి, ఏలూరి పోచవ్వ, ముక్క భారతమ్మ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మ తదితరులు పోతిరెడ్డిపల్లిలోని తమ బంధువుల ఇండ్లకు పండుగ కోసం వెళ్లారు. ఈ క్రమంలో పండుగ చూసుకొని స్వగ్రామానికి ఆటోలో తిరిగి వస్తుండగా మార్గంమధ్యలోని పెట్రోల్‌బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడడంతో ఆందులో ఉన్న అందరికీ తీవ్రగాయాలయ్యాయి. చుట్టూ పక్కల వారు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో పాటు గాయాలైన వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రైవేట్ అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని చేర్యాల సర్కార్ దవాఖానకు తరలించారు.వైద్యులు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. ముక్క స్వరూప, ముక్క లక్ష్మి, భారతమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో పాటు ఏలూరి పోచవ్వ, ఏలూరి బాలమణి, ఏలూరి వజ్రమ్మలను మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు సిద్దిపేటకు తరలించారు. మిగతావారికి స్వల్పగాయాలు కావడంతో చేర్యాల దవాఖానలో చికిత్స చేస్తున్నారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో 'ఏఎంసీ' చిచ్చు

- రెండు గ్రూపులుగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు
- కాంగ్రెస్‌లో బయటపడ్డ గ్రూపులు

గజ్వేల్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు

గజ్వేల్, జూన్ 19: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో గజ్వేల్, వంటిమామిడి, కొండపాక, తూప్రాన్ మండలాల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నారు. ఇటీవల ఆయా మార్కెట్ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్ల నియామకం కోసం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కొంతమంది పేర్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖకు అందజేసినట్లు తెలిసింది. గజ్వేల్ ఏఎంసీ పదవి కోసం జగదేవ్‌పూర్ మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధికి కట్టబెడుతున్నట్లు తెలిసి గజ్వేల్‌కు చెందిన సీనియర్ నాయకులు నిరుత్సాహంతో రగిలిపోతున్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేశామని కోరుతూ మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో పీసీసీ ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ భానుప్రసాద్‌రావు వినతిపత్రం అందజేసి తమకు ఏఎంసీ పదవి ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం గజ్వేల్ కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు రెండు గ్రూపులుగా విడిపోయి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదంతా చూసిన కాంగ్రెస్ కార్యకర్తలు నవ్వుకుంటున్నారు. పార్టీ పరువు బజారున పడేశారు అంటూ అదే పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నారు. ఎన్నికల ముందు నుంచి గజ్వేల్‌లో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా ఉన్నప్పటికీ పార్టీ పెద్దలు ఏమాత్రం పట్టించుకోలేదని కార్యకర్తలు వాపోతున్నారు.

రెండు గ్రూపులుగా రాహుల్ పుట్టినరోజు వేడుకలు

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం గజ్వేల్‌లో కాంగ్రెస్ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌లకు చెందిన నాయకులు గ్రూపులుగా విడిపోయి పూజలు చేసిన అనంతరం కేక్‌కట్ చేసి అన్నదానం చేశారు. రెండు గ్రూపులుగా రాహుల్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడంతో పార్టీలో గ్రూపులు బయటపడ్డాయి. ఇందిరాపార్కు చౌరస్తాలో ఓ వర్గం నేతలు కేక్ కట్ చేసి అన్నదానం చేయగా మరో వర్గం నేతలు కేసరి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్‌కట్ చేశారు. పదేండ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గజ్వేల్ కాంగ్రెస్ నేతలు అవలంబిస్తున్న తీరుతో కార్యకర్తల్లోనే అసహనం వ్యక్తమవుతున్నది.

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆదేశాలతో అన్నదానం చేస్తున్న నేతలు

నులి పురుగులను నివారిద్దాం

కలెక్టర్ మను చౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, జూన్ 19: పిల్లల్లో నులి పురుగులను నివారిద్దామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుదామన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2, 38, 559 మంది పిల్లలు ఉన్నారని, జూన్ 20వ తేదీన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. జూన్ 20వ తేదీన వేసుకోని పిల్లలకు జూన్ 27వ తేదీన మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ మాత్రలు వేసేందుకు తగిన విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నపిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయరాణి, సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ కిశోర్ కుమార్, డాక్టర్ సాయి కిరణ్ తోపాటు ఆయా శాఖల అధికారులు, వైద్యారోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

గజ్వేల్, జూన్ 19: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి నేటికీ పథకాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు.

ఉత్తమ పైలట్‌గా కన్నారెడ్డి



అవార్డు అందుకుంటున్న కన్నారెడ్డి

గజ్వేల్, జూన్ 19 : 108లో విధులు నిర్వహిస్తున్న కన్నారెడ్డికి బుధవారం ఉమ్మడి జిల్లా గ్రీన్‌హెల్త్ సర్వీస్ ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ ఉత్తమ పైలట్ అవార్డు అందజేశారు. అనంతరం 108, 102, 1962 వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అవార్డు అందుకున్న కన్నారెడ్డిని అభినందించారు.

వరి నారుమడుల్లో జాగ్రత్తలు చేపట్టాలి

కొమురవెల్లి, జూన్ 19 : వరి నారుమడుల్లో రైతులు జాగ్రత్తలు చేపట్టాలని కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి ఎం. నరేశ్ సూచించారు. బుధవారం మండలంలోని మర్రిముచ్చాలలో వరి నారుమడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వరి నారుమడి దశలో ఉందని, ఇప్పటి నుంచే జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బెజ్జంకి, జూన్ 19: మండలంలోని చీలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తప్పెడ ఓదయ్య, ముత్తన్నపేట పాఠశాల ఉపాధ్యాయుడు వడ్ల కొండ శ్రీనివాస్, రేగులపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన సుమలత, క్రాసింగ్ ప్రాథమిక పాఠశాలకు చెందిన సుచరిత ఉద్యోగోన్నతి పొందారు. శ్రీనివాస్ బెజ్జంకి ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా, ఓదయ్య గుగ్గిళ్ల ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా, సుమలత దాచారం సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలిగా, సుచరిత గాగిల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగోన్నతి పొంది బుధవారం విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు.

అ 'పూర్వ' సమ్మేళనం

నెంటూర్‌లో 2004-5 బ్యాచ్ టెన్త్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వర్గల్,జూన్19: వర్గల్ మండలం నెంటూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2004-2005 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు బుధవారం సమ్మేళనం జరుపుకొన్నారు. ఈసందర్భంగా 20 ఏండ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరినొకరు నెమరువేసుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామస్వామి, రామరాజు, రంగు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నారాయణరావుపేట, జూన్ 19: వ్యవసాయ రంగంలో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు సతీశ్ కుమార్, మంజునాథ్ అన్నారు. బుధవారం నారాయణరావుపేటతో పాటు గోపులాపూర్‌లో బుగ్గ రాజరాజేశ్వర రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు ఆముదం పంట గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ బాలకృష్ణ, శాస్త్రవేత్తలు ప్రసాద్, ఖురేషి, ఎఫ్‌పీవో చైర్మన్ ఎల్లారెడ్డి, ఏవో రమణి, ఏఈవో నాగార్జున పాల్గొన్నారు.

వర్షం పడిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి

ధర్మారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

మద్దూరు (ధూళిమిట్ట), జూన్19: సమృద్ధిగా వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని మద్దూరు మండల వ్యవసాయశాఖ అధికారి బూరెల రామకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం మద్దూరు మండలం సలాఖపూర్, ధర్మారం గ్రామాల్లో పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలన్నారు. పాక్షికంగా పడిన వర్షానికి విత్తనాలు వేస్తే భూమిలో ఉష్ణోగ్రతలు తగ్గక పోవడం వల్ల విత్తనాలు మొలకెత్తవన్నారు. రైతులకు సరిపడా పత్తి, వరి, మొక్కజొన్న విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట ఏఈవో అఖిల్, రైతులు ఉన్నారు.

గుడుంబా, బెల్లం పానకం ధ్వంసం

బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

హుస్నాబాద్, జూన్19: మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ ఎక్సైజ్ సర్కిల్ అధికారులు బుధవారం జరిపిన దాడుల్లో ఐదు లీటర్ల గుడుంబాతో పాటు 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. హుస్నాబాద్ మండలంలోని భల్లూనాయక్ తండాకు చెందిన అజ్మీరా సుగుణబాయి, అజ్మీరా సమ్మవ్వల వద్ద గుడుంబా, బెల్లం పానకం స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశామని ఆయన చెప్పారు. వీరిద్దరూ గతంలో గుడుంబా తయారు చేస్తూ పట్టుబడగా బైండోవర్ చేశామని, బైండోవర్‌ను ఉల్లంఘిస్తూ మళ్లీ గుడుంబా తయారు చేస్తూ పట్టుపడినందున వీరికి ఒక్కొక్కరికి రూ.25వేల జరిమానా, మొత్తం రూ.50వేల జరిమానా విధించామని తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీనాయక్, సీఐ పవన్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై సరిత, హుస్నాబాద్ ఎస్సైలు రూప, దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కలెక్టరేట్, జూన్19: హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 24న యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ మను చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 60 కంపెనీల్లో 5 వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి 18 నుంచి 35 ఏండ్లలోపు వయస్సు ఉండాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జంకి, జూన్ 19: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నైట్ వాచ్‌మెన్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో యాదవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుంచి 45 ఏండ్ల లోపు ఉండి, టెన్త్ ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. దరఖాస్తుతోపాటు మెమో, ఆధార్, రేషన్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లను జతచేసి, ఈనెల 20 తేదీ నుంచి 28 తేదీ వరకు స్థానిక పాఠశాలలో అందజేయాలని ఆయన సూచించారు.

వృద్ధాశ్రమానికి బీరువా అందజేత

సిద్దిపేట టౌన్, జూన్ 19 : సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో భారత్‌నగర్‌లోని వృద్ధాశ్రమానికి బుధవారం దాతల ఆర్థిక సహకారంతో బీరువా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, నేతి వేణుకుమార్, మంకాల శ్రీనివాస్, పుల్లూరి శ్రీనివాస్, వీరేశం, శ్రీనివాస్, ఉమరాణి పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

కోహెడ, జూన్ 19: అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఆగస్టు 15లోగా మాఫీ చేస్తామని మాట మార్చారని సింగిల్‌విండో చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన కోహెడలో విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 15 సమీపిస్తున్న నేపథ్యంలో రుణమాఫీకి రేషన్‌కార్డులు, పాసుబుక్కులకు లింక్ పేడుతున్నారని ఉహాగనాలు వినిపిస్తున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎలాంటి షరతులు విధించకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని రేవంత్‌రెడ్డిని ఒప్పించి రుణమాఫీ చేయించాలన్నారు.

సాక్షుల రక్షణకు మరో ముందడుగు

వీడబ్ల్యూడీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేట టౌన్,జూన్ 19 : సాక్షుల రక్షణకు మరో ముందడుగు పడిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీడబ్ల్యూడీసీ సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..సాక్షుల సౌకర్యార్థం.. రక్షణకు వీడబ్ల్యూడీసీ కేంద్రాన్ని ప్రారంభించుకున్నామన్నారు. కోర్టుకు వచ్చే సాక్షులను కాపాడడం తమ బాధ్యత అన్నారు. అంతకు ముందు కోర్టు ఆవరణలో జడ్జీలు, పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్జీలు స్వాతిరెడ్డి, చందన, మిలింద్ కాంబ్లే, శ్రావణి యాదవ్, ఏసీపీ మధు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి,సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, పీపీ వెంకటలింగం, న్యాయవాదులు పత్రీప్రకాశ్, రవీందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడి మృతి

దుబ్బాక, జూన్19: స్నేహితులతో కలిసి శుభాకార్యానికి వచ్చిన యువకుడు తిరుగు ప్రయాణంలోబావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన కుమ్మరి ప్రశాంత్ (26) తన స్నేహితుడైన నవీన్ సోదరి ఇంట్లో శుభాకార్యక్రమానికి మంగళవారం దుబ్బాక మండలం అప్పనపల్లికి వచ్చాడు. రాత్రి ఏడు గంటల సమయంలో ప్రశాంత్ తన స్నేహితులైన శ్రీకాంత్ నాగరాజు, ప్రవీణ్‌తో కలిసి రుద్రారం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. అప్పనపల్లి-తిమ్మాపూర్ మధ్యలో ప్రశాంత్ బహిర్భూమి కోసం రోడ్డు పక్కకు వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఒక్కసారిగా పెద్దగా శబ్దం రావడంతో అతడి మిత్రులు ఘటనా స్థలానికి వెళ్లి చూసే సరికి బావిలో ప్రశాంత్ మునిగిపోయాడు. బావిలో నీరు అధికంగా ఉండటంతో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో నీటిని తోడేశారు. బుధవారం వేకువజామున ప్రశాంత్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ఉండాలి

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 19: మానవ శరీరంలోకి ఆక్సిజన్ వెళ్లకుండా రక్త కణాలను వాపుకు గురిచేసే సికిల్ సెల్ అనీమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభాకర్ అన్నారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ నివారణ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఎం.ఫిరంగితో కలిసి ఆయన మాట్లాడారు. సికిల్‌సెల్ వ్యాధి రానురాను ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీహెచ్‌వో శబ్దప్రకాశ్, ప్రత్యేకాధికారి నటరాజ్, హెచ్ఎంలు శ్రీనివాస్, శ్రీనాథ్, వార్డెన్లు భిక్షపతి, శ్రీనివాస్, నదీమ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విషమించి రైతు మృతి

గజ్వేల్, జూన్ 19: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని గిరిపల్లిలో చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మద్దికుంట లక్ష్మయ్య (51) తనకున్న రెండున్నర ఎకరాలతోపాటు మరో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయసాగు, కుటుంబపోషణ కోసం చేసిన అప్పులు అధికంకావడంతో మద్యానికి బానిసై ఈనెల 17న వ్యవసాయ పొలం వద్ద మందు బిల్లలు మింగాడు. తండ్రి ఎంతకీ ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో కనిపించాడు. వెంటనే చికిత్స కోసం గజ్వేల్ దవాఖానకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించిన తర్వాత మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందు తూ విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మిరుదొడ్డి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి

మిరుదొడ్డి, జూన్ 19 : మిరుదొడ్డిలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ ఏడు నెలలనుంచి రాష్ట్ర ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. జీతాలు ఇవ్వకుంటే పనులు బంద్‌చేసి ఆం దోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు మహేశ్, పరశురాము లు, మల్లేశం, ముత్తవ్వ, ఎల్లవ్వ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

సిద్దిపేట, జూన్ 19: జిల్లాలో అధిక ఫీజు లు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షు డు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డా రు. విద్యాసంస్థలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల